క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

డిండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ(ఐటీఐ)లో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ బి.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోప, డ్రాట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, స్టెనోగ్రఫీ, వెల్డర్ ట్రేడ్‌ల లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వివరాలకు 9441237136 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

డిండి : మండల పరిధిలోని ప్రతాప్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నవాయు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మునగపాటి వంశీకృష్ణ వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పవన్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం ప్రత్యేక అధికారిగా శ్రీదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి

త్రిపురారం : జెడ్పీటీసీ, ఎంపీపీల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో ఏఎమ్ఆర్‌పీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వందనం శ్రీదేవి త్రిపురారం మండల ప్రత్యేక అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ప్రత్యేక అధికారి శ్రీదేవికి స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ కుమారి, తహసీల్దార్ గాజుల ప్రమీలా, ఎంఈఓ బాలాజీ నాయక్, ఇంచార్జీ ఎంపీఓ కొడిరెక్క రాజేంద్ర కుమార్, సీనియర్ అసిస్టెంట్ తాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

దేవరకొండ : ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ అన్నారు. జనసంఘ్ వ్యవస్థాకులు స్వర్గీయ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంత్యుత్సవాల సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క' అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త తమ తల్లి పేరుతో ఒక్క మొక్కను నాటాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వస్కుల సుధాకర్, గుండాల అంజయ్య, రెడ్డి శంకర్, చండీశ్వర్, సహదేవ్, ఉప్పల వెంకటేష్, నారోజు పద్మ, గంప ఫణి తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షుడు

దేవరకొండ : లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యానారాయణ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గ్రామంలో క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో మొత్తం 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చిలుకూరి నిరంజన్, వనం భిక్షమయ్య, పగిడిమర్రి శ్రీనివాసులు, వనం శ్రీను, లకుమారపు మల్లయ్య పాల్గొన్నారు.

సీఎస్సీల ద్వారానే మీ సేవా కేంద్రాలు ఏర్పాటుచేయాలి

మిర్యాలగూడ : గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సర్వీసులను అందిస్తున్న సీఎస్సీల ద్వారానే రాష్ట్ర మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నల్లగొండ జిల్లా వీఎల్ఈలు ఖాజా సయ్యద్, హేమంత్, నాగేందర్, ముస్తఫా, షామిల్‌లు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో కొన్నేళ్లుగా సీఎస్సీలు ఈ గవర్నెన్స్, ఆయుష్మాన్‌భారత్, పీఎం కిసాన్, ఆరోగ్యశ్రీ, ఇతర బ్యాంక్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. సీఎస్సీ కేంద్రాలు అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ సర్వీసులను అందిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వీఎల్ఈలు సమష్టిగా పోరాడితేనే రాష్ట్ర సర్వీసులు సాధించగలమన్నారు. రాష్ట్ర సర్వీసులను సాధించుకునేందుకు త్వరలో పోరాటం చేస్తామన్నారు.

ఓపెన్ జిమ్.. నిర్వహణ నిల్ !

- విరిగిపోయిన వ్యాయామ పరికరాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం



ఎస్ఎస్‌పీ క్యాంపులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో విరిగిన పరికరాలు



బాపూజీనగర్‌లో మ్యాట్ లేకుండా ఉన్న ఓపెన్ జిమ్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిర్వహణ సక్రమంగా లేదు. ఏర్పాటు చేసిన జిమ్ పరకరాలు విరిగిపోయిన, మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారు కరువయ్యారు. సదరు గుత్తేదారుతో మరమ్మతులు చేయించాల్సిన ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిర్వహణ సరిగా లేకనే ఆ పరికరాలు విరిగిపోతున్నాయని పేర్కొంటున్నారు. అదే విధంగా ఓపెన్ జిమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మ్యాట్లు కూడా ఎక్కడికక్కడే ఊడిపోతున్నాయి. దీంతో వ్యాయామ పరికరాలు మాత్రం పూర్తిగా అలంకార ప్రాయంగా మారిపోయాయని స్థానికులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ అర్బన్ ఇన్‌స్ట్రక్చర్ డవలప్‌మెంటు పథకం కింద యాద్గార్‌పల్లి చెరువు(బోటింగ్ పార్క్), ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, ఎస్ఎస్‌పీ క్యాంపుతో పాటు సుందరయ్య పార్క్‌లో ఏర్పాటు చేశారు.

రోజు రోజుకు ఆదరణ

మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లకు రోజు రోజుకు ప్రజల నుంచి మంచి ఆదరణ పెరగుతుంది. చిన్నా..పెద్దా.. అనే తేడా లేకుండా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో జిమ్‌కు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక్కోక్క జిమ్‌కు నిర్వహణతో పాటు 13 రకాల పరికాలను 15 లక్షల రూపాయలతో వ్యాయమ పరికరాలను ఏర్పాటు చేశారు. కానీ పరికరాలు తుప్పుపట్టి విరిగిపోతుండటంతో వ్యయంకు వచ్చేవారు ఉసురుమంటూ వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లో నూతన పరికరాలు ఏర్పటు చేసి పునరుద్దరించాలని కోరుతున్నారు. కాగా ప్రతి ఆదివారంతో పాటు సెలవు రోజుల్లో మాత్రం జిమ్ వద్ద సందడి నెలకొంటుంది. ఓపెన్ జిమ్‌లతో పాటు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్‌లు కూడా అలంకార ప్రాయంగా మారాయి. ఈ జీమ్ అందుకు సంబందించిన విరిగిన పరికరాలకు మరమ్మతులు చేసి ఓపెన్ జిమ్‌లను అందుబాటుకి తీసుకరావాలని కోరుతున్నారు.

పరికరాలు విరిగిపోతున్నాయి



మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు పరికరాలు విరిగి నిరుపయోగంగా ఉంటున్నాయి. ఓపెన్ జిమ్‌ల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు విరిగిన పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. కేంద్రం ఏర్పాటు చేసిన ఈ జిమ్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన ఉన్నప్పటికీ పరికరాలు విరిగి పడిపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయం చేసే అవకాశం కూడా లేకుండా పోతుంది.

– చిల్లంచర్ల అభిరామ్, మిర్యాలగూడ

పర్యవేక్షణ కరువు



మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లలో వ్యాయామ పరికరాలు విరిగిపోతున్నాయి. వాటికి కనీసం మరమ్మతులలో భాగంగా వెల్డింగ్ అయిన చేస్తే బాగుండేది. వ్యాయామం చేస్తే చాల ఆరోగ్యంగా ఉండవచ్చనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జిమ్‌లలో పర్యవేక్షణ కరువు. ఓపెన్ జిమ్‌లలో పరికరాలకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– నవీన్, మిర్యాలగూడ

మరమ్మతులు చేయిస్తాం



మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. ఈ విషయంపై కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులా లేదా కొత్తవి ఏర్పాటు చేయాల అనేది కౌన్సిల్ చర్చిస్తుంది. ఎక్కడెక్కడ విరిగిపోయాయో వివరాఉల తెలుసుకుంటాం. తిరిగి ప్రజలకు ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తీసుకవచ్చేందుకు కృషి చేస్తాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విదార్థులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వందనం శ్రీదేవి

త్రిపురారం : సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని త్రిపరారం మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వందనం శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు వడ్డించే భోజనం, కూరలు, సాంబరును పరిశీలించారు. పాఠశాలతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొని, ఏ రోజు పాఠ్యంశాలను ఆరోజే చదువుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ కుమారి, త్రిపురారం ఎంఈఓ బాలాజీ నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీఓ కొడిరెక్క రాజేంద్ర కుమార్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రయాణికులను ఆకట్టుకునేందుకే బహుమతులు



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ నుంచి విజయవాడకు వెళ్లే రూట్లలో ప్రయాణికులను ఆకట్టుకునేందుకు 'బస్సెక్కండి బహుమతి పొందండి' అనే కార్యక్రమాన్ని దాతల సహకారంతో చేపట్టినట్లు మిర్యాలగూడ డిపో మేనేజర్ పాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డీలక్స్ బస్సులో ప్రయాణించిన లక్కీ డ్రా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎం బొల్లెద్దు పాల్ మాట్లాడుతూ జీవీ మాల్ సౌజన్యంతో లక్కీ డ్రాలో మొదటి బహుమతి విజయవాడకు చెందిన వనజాక్షి, ద్వితీయ బహుమతి విజయవాడకు చెందిన మాధవి, తృతీయ బహుమతి మిర్యాలగూడ పట్టణానికి చెందిన అభేదా బేగంలకు అందించారు.ఈ కార్యక్రమంలో డీపో సీఐ భారతీబాయి, ఎంఎఫ్ యాదగిరి, స్టేషన్ మేనేజర్ బిక్షమమ్మ, సీఐ జనరల్ జనార్థన్‌లతో పాటు ఆర్టీసీ సిబ్బంది తదితరులున్నారు.

బహుమతులు అందజేత

దేవరకొండ : డీలక్స్ బస్సులో ప్రయాణించి లక్కీ డ్రాలో గెలుపొందిన ముగ్గురు ప్రయాణికులకు దేవరకొండ డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు శుక్రవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ, హైద్రాబాద్, మాచర్ల రూట్లలో నడుస్తున్న డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేసిన మహిళా ప్రయాణికులు ప్రయాణం పూర్తయిన తర్వాత బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో టికెట్ వెనకాల ప్రయాణికుల పేరు, ఫోన్ నంబర్, తదితర వివరాలు రాసి వేయాలని ఆయన సూచించారు. ప్రతి 15రోజులకు ఒకసారి డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమ ంలో నేలంటి సోమేశ్వర్, వాహిద్, తదితరులున్నారు.

ప్రజా సేవకు పదవులు అవసరం లేదు



పదవీ విరమణ పొందిన ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



శివకుమార్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ప్రజా సేవా చేసేందుకు పదవులు అవసరం లేదని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. పదవీకాలం పూర్తి చేసుకున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన ఘనంగా సన్మానించి మాట్లాడారు. పదవీకాలం పూర్తయినప్పటికీ ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మోసిన్‌అలీ, మాజీ ఎంపీపీలు నూకల సరళహన్మంతరెడ్డి, పోకల శ్రీవిద్య, బాలాజీనాయక్, జెడ్పీటీసీలు లలితహతీరాంనాయక్, సేవ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వీరకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే సన్మానం

జేఈఈ అడ్వాన్స్ జనరల్ కేటగిరిలో 211వ ర్యాంక్, బీసీ కేటగిరిలో 24వ ర్యాంక్ సాధించి బాంబే ఐఐటీలో సీటు సాధించిన మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కుంచం శివను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివకుమార్ ఉన్నత విద్యనభ్యసించి పేదలకు సేవ చేయాలన్నారు. భవిష్యత్తులో విద్యార్థి కుంచం శివకు తాను అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. కాగా బీఆర్ఎస్ నాయకుడు మన్నెం శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థి శివకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని భాస్కర్‌రావు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్దార్థ, జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ధర్మపాల్‌రెడ్డి, మన్నెం సైదిరెడ్డి, షోయబ్, జన్నపాల కిరణ్, నాగభూషణం, కుంచం రాజ్‌కుమార్, రమావత్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని, ఆవరణను వైద్యులు, సిబ్బంది పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించి రోగులను సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. డయాలసిస్ రోగులకు ప్రస్తుతం ఉన్న ఐదు మిషనరీస్‌తోపాటు మరో ఐదు మిషనరీస్ మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని జనరల్ వార్డు, గర్భిణీ, పిల్లల వార్డులను ఆయన పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆస్పత్రి ఆవరణను పరిశీలించి వాహనాల పార్కింగ్, రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకునే విధంగా చెట్లను పెంచాలని, సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేయాలని, పరిసరాల్లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో అన్ని మౌలికవసతులు ఉన్నాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని 9వ వార్డు ప్రకాశ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జీ అవుట శ్రీనివాస్, తాజ్‌బాబాల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాలోతు బాలాజీనాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, అవుట ధనలక్ష్మి, మిట్టపల్లి భాస్కర్, వల్లమల రవికుమార్, సురేష్, బాలునాయక్, సత్యనారాయణ, అవుట రాములు, ఆనంద్, చక్రినాయక్, లక్ష్మణ్, నాగరాజు, విజయ్, అక్బర్, రాము, హర్షిష్ తదితరులున్నారు.



మిర్యాలగూడ అర్బన్ : రోగులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

తడకమళ్ల గ్రామంలో..

మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ, చైతన్య జనసేవా సంఘం దివ్యాంగ ఆధ్వర్యంలో గుడిపాటి నవీన్ దాతృత్వంతో ప్రాథమిక పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, కంపాక్స్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగయ్య, సింగు రాంబాబు, శంకర్‌నాయక్, మురారీ, బాగ్యలక్ష్మి, సైదులు, వీర్య, సింగ్, ధనుష్, కోక్కు కృష్ణయ్యలతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమట్టి డంపులు సీజ్



నల్లమట్టిని సీజ్ చేస్తున్న అధికారులు

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు తిరుమలాపురం, నసర్లపల్లి, గడియగౌరారం గ్రామపంచాయతీలలో ఆరు నల్లమట్టి డంపులను శుక్రవారం రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అనుమతులు లేకుండా డంప్ చేసిన నల్లమట్టిని సీజ్ చేసినట్లు అసిస్టెంట్ జియాలజీ మైనింగ్ శాఖ ఆర్ఐ యాదయ్య, పోలీసుశాఖ అధికారులు తెలిపారు. ఈనెల 30 ≈ఇటుక బట్టి.. నిబంధనలు పక్కనపెట్టి≈ అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ,అధికారులు స్పందించి ఆరు నల్లమట్టి డంపులను సీజ్ చేశారు. మైనింగ్ శాఖ నుంచి వే బిల్లు, గ్రామపంచాయతీ నుంచి అనుమతులు, రెవెన్యూ శాఖ నుంచి భూమి నాలా కన్వెన్షన్ అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండా భారీ స్థాయిలో డంప్‌లను నిల్వ చేయడంతో సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉద్యమాలతోనే హక్కులు సాధ్యం

త్రిపురారం : ఉద్యమాలతోనే ప్రజల తమ హక్కులను సాధించుకోవచ్చని సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, కరెంటు బిల్లులు, వంట గ్యాస్‌కు సంబందించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నెల 8న నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహిం,చే సీపీఎం శిక్షణ తరగతులను నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కొప్పు వెంకన్న, ఇద్దయ్య, రాములు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



త్రిపురారం : బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్

చింతపల్లి : మండల పరిధిలోని హోమంతాలపల్లి, పికె.మల్లేపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం మండల పీఆర్టీయూ నాయకులు, యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గురువారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సుధీర్‌కుమార్, రమేశ్, మోతీలాల్, హనుమంతునాయక్, నాగరాజు, ప్రేమలత, పద్మావతి,జయశ్రీ, సైదులు, కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

త్రిపురారం : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఎక్కడ విధులు నిర్వహించినా బాధ్యతగా పనిచేయాలని త్రిపురారం మండల ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దదేవులపల్లి, త్రిపురారం మండల పరిషత్ పాఠశాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలాజీ నాయక్ మాట్లాడారు. ఉపాధ్యాయులు విధులతో పాటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతాని అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి కుమార్ నాయక్, ఉపాధ్యాయులు పంతులు, శంకర్, మల్లయ్య, కిశోర్ నాయక్, వెంకటయ్య, వెంకన్న యాదవ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

హాలియా : ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు నుంచి ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్‌గా డిండి మండలంలోని కామేపల్లికి పదోన్నతిపై వెళ్లిన నెమలి వెంకట్‌రెడ్డిని శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లి గెజిటెడ్ హెచ్ఎం దాసా వెంకన్న ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులు రావు గౌతమ్, కుర్మారెడ్డి, రామకృష్ణ, రాజ్యలక్ష్మి, ప్రశాంత్‌కుమార్, అస్మత్ తారా, జ్యోతి, వాణీ తదితరులు ఉన్నారు.

ఉచిత కోచింగ్‌కు గిరిజన విద్యార్థి ఎంపిక



క్యాంపస్ ప్రవేశ పత్రాన్ని విద్యార్థికి అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్

అడవిదేవులపల్లి : ఐఐటీ, జేఈఈ ప్రవేశ పరీక్షల కోసం రెండేళ్ల పాటు బెంగుళూరులో దక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కోచింగ్‌కు అడవిదేవులపల్లి మండలం బంగారుకుంట తండా గ్రామానికి చెందిన కుర్ర కృష్ణప్రసాద్ ఎంపికయ్యాడు. కృష్ణప్రసాద్ చలకుర్తి నవోదయ పాఠశాలలో 10వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించాడు. ఈ విద్యార్థి రెండేళ్ల పాటు బెంగుళూరులోని నవోదయ విద్యాలయం బాగలూరి క్యాంపస్‌కు ఎంపికై న పత్రాన్ని వైస్ ప్రిన్సిపల్ సుందర్‌కుమార్ విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల తండాలో పుట్టి పెరిగిన గ్రామీణ ప్రాంతాల్లో చదివి అక్కడి వారికి సేవ చేయాలంటే ఎంతో ఓపికతో కష్టపడి చదవాలన్నారు. వీరితో పాటు వారి తల్లిదండ్రులు కుర్ర నాగ, జ్యోతి, క్షుర్ర కృష్ణకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



తిరుమలగిరి : అరెస్టయిన బీజేవైఎం నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీజేపీ ఏబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెండె అనిల్ కుమార్ అన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం తలపెట్టిన మహాధర్నాకు వెళ్లకుండా మండలంలోని ఆ సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ డీఎస్సీ పోస్టులను పెంచి మూడు నెలల పాటు వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేవైఎం నాయకులు రాము, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్

కొండమల్లేపల్లి : నీట్, ఉద్యోగాల భర్తీకి సంబంధించి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పలువురు విద్యార్థి సంఘాల నాయకులు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఏబీవీపీ నాయకుడు కొత్త అఖిల్, బీఆర్ఎస్వీ నాయకుడు కొర్ర కోటేష్‌నాయక్, తులసిరాంనాయక్, రమేష్ తదితరులున్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

డిండి : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నందుకు ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమల నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయకపోతే ఏఐవైఎఫ్ తరుపున ఉద్యమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

దేవరకొండ : ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.15వేల600 ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 15నుండి కనీస వేతనం అమలు చేయకపోతే కార్మికులు సమ్మెలోకి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, రామేశ్వరమ్మ, వనజ, రాణి, భద్రమ్మ, తారమ్మ, అలివేలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ : అక్రమంగా లారీలో తరలిస్తున్న సుమారు 22టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం దామరచర్ల మండలం శివారులోని జాన్‌పహాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. దామరచర్ల ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ వీరబాబుల పర్యవేక్షణలో మధ్యాహ్నం 12గంటల సమయంలో జాన్‌పహాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా అదే సమయంలో జాన్‌పహాడ్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న ఓ లారీని ఆపారు. అతడు లారీని నిలపకుండా వెళ్తుండడంతో పోలీసులు లారీని వెంబడించి కృష్ణానది బ్రిడ్జి వద్ద పట్టుకోని విచారించారు. దీంతో లారీలో 22టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఆంధ్రాకు తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుబడిన లారీని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌తో పాటు పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దేవరకొండలో 54 క్వింటాళ్లు..

దేవరకొండ : అక్రమంగా తరలిస్తున్న 54క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి నుంచి నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తికి బొలేరో వాహనంలో తరలిస్తున్న 32క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టణ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. అదే విధంగా దేవరకొండ మండలం నుంచి 22క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

మిర్యాలగూడ టౌన్ : మండలం పరిధిలోని జంకు తండాలో శుక్రవారం గ్రామానికి చెందిన భూక్య బాల ఇంట్లో నిల్వ ఉన్న 25 బ్యాగులు(7.50 క్వింటాలు) బియాన్ని మిర్యాలగూడ రూరల్ పోలీసులు దాడులు చేసి నిల్వ ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశారు.

ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో శనివారం నుంచి ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బంది, బిల్ కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆస్తి పన్నుల వసూళ్లలో రాయితీని కల్పించినప్పటికీ చాలా మంది సద్వినియోగం చేసుకోలేకపోయారన్నారు. బకాయిలను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్ఓ కళ్యాణి, ఆర్ఐలు రాకేష్, రవి, బిల్ కలెక్టర్లు ఖలీల్, బిక్షం, యాదగిరి, రమేష్, ఎల్లయ్య తదితరులున్నారు.